ప్రమాదం అంచున ప్రజారోగ్యం

- రహదారి అంచులే డంపింగ్ యార్డులు
- విజృంభిస్తున్న దోమలు
- ప్రబలుతున్న వ్యాధులు
- మచ్చుకైనా కానరాని 'స్వచ్ఛభారత్'



ఉన్నత పాఠశాల గోడ పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారం



రోడ్డుపక్కన పడేసిన కొబ్బరి బొండాలు, చెత్త

దెందులూరు: పట్టణం..పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితి నెలకొంది. ప్రధాన రహదారులు అంచులనే గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నాయి. నియోజకవర్గంలో గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న చెత్త గుట్టలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. రోడ్ల మార్జిన్‌లోనే రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార ప్రకటనకు సంబంధించిన భారీ కటౌట్లు, బ్యానర్లు పెడుతున్నారు. దీంతో నియోజకవర్గంలో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

చెత్తకు నిప్పు పెట్టడంతో...

అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో చెత్త కుప్పలకు నిప్పు పెట్టి వదిలివేయడంతో తడిగా ఉండటంతో వీటి నుంచి వచ్చే పొగతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. రహదారిని అనుకొని ఉన్న గ్రామాల వద్ద చెత్త కుప్పలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దోమలు విజృంభించి వ్యాధులు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య, కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో పట్టణంలోని, మండలాల్లోని గ్రామాల్లో వీధులు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు నెలల క్రిందట సాక్షాత్తు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దెందులూరులో పేరుకుపోయిన చెత్త కొబ్బరిబొండాలు చూసి అధికారులను తీవ్రంగా మందలించిన సంగతి అందరికీ తెలిసిందే. అయినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా చెత్త, కొబ్బరి బోండాలు అలాగే ఉన్నాయి. ఉన్నత పాఠశాల గోడ ఆనుకుని ట్రాక్టర్ల చెత్త చెదారం పేరుకుపోయి దోమలు ఈగలకు నిలయంగా మారిన ఏమాత్రం స్పందన లేకపోవడం గ్రామస్తులను తీవ్రంగా కలిచి వేస్తోంది.

వ్యర్థాలన్నీ రోడ్ల పక్కనే:

మండలంలోని జాతీయ రహదారి ఇరువైపులా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తకుప్పల వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాలి వీచినప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, పాలిథీన్ కవర్లు ఎగురొచ్చి వాహనాలపై పడుతుండడంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. కాఫీ, బోజనం హోటళ్ల వంటి వ్యాపార సంస్థలు ఉండడంతో నిత్యం చెత్తను పట్టుకొని వచ్చి రోడ్డు పక్కనే వేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



డంపింగ్ యార్డులు ఏర్పాటుపై ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తేనే దానికి అనుబంధంగా ఉన్న అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి. ఆలస్యం చేస్తే సమస్య మరింత జటిలమవుతుంది.

కట్టా ఏసుబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి

ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ?



నియోజకవర్గంలో పారిశుద్ధ్య అమలులో సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఉన్నతాధికారులు లేకపోవడం గమనార్హం. సమష్టి బాధ్యతగా సంపూర్ణ ఆరోగ్య గ్రామాలు లక్ష్యంగా అధికారులు తరచూ సమీక్షలు చేయాలి.

దేవదాసు ప్రేమ్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి

చర్యలు తీసుకోవాలి



డ్రెయిన్లలో చెత్త చెదారం పేరుకుపోవడంతో గ్రామంలో అపారిశుద్ధ్య నెలకొంది. రోడ్డు కిరువైపులా డంపింగ్ యార్డు ఉండటంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

సొంగా ప్రమీల, ఎంపీటీసీ, గాలాయగూడెం

క్లుప్తంగా

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నతానియేలు

దెందులూరు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియల్ తెలిపారు. బుధవారం గంగన్నగూడెం పామాయిల్ తోటలో యూజీడీ, బీపీఈడీ వ్యాయామ అధ్యాపక, విద్యార్థులకు ఒకరోజు కల్చరల్ ఆక్టివిటీస్ రిక్రియేషన్ గేమ్స్ అవగాహన సమావేశం ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియేల్ అధ్యక్షతన జరిగింది. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఆటవిడుపు ఎంతో అవసరమన్నారు. దయనందిత జీవితంలో మానసిక ఒత్తిడిలను ఇవి దూరం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫ్యాకల్టీ డాక్టర్ దిలీప్ కుమార్, సొంగ డాక్టర్ బి రతన్ బాబు, పతాంజలి, జై శ్రీ, యూజీడీ బీపీఈడీ వ్యాయామ అధ్యాపక విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



గోపాలపురంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని డీపీఎం బాలిన వెంకటేష్ తెలిపారు. బుధవారం గోపాలపురంలో పకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలన్నారు. పీఎండీఎస్ ద్వారా వచ్చే పచ్చిరొట్ట పశువులకు మేతగా వేయడం వలన పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. భూమి కోతకు గురి కాకుండా పచ్చిరొట్ట పంటలు కాపాడుతాయని తెలిపారు. రసాయనిక ఎరువులు వాడటం మట్టి ఆరోగ్యానికి హానికరమని వెంకటేష్ వివరించారు. రసాయనిక ఎరువులు నివారించి పక్రతి వ్యవసాయాన్ని పద్ధతు అనుసరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఉంగుటూరు: పరిసరాల పరిశుభ్రత పాటించాలని లక్ష్మణరావు తెలిపారు. దోమలు నివారణపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. యర్రమళ్ల, నీలాద్రిపురం,నాచుగుంట, గ్రామాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు ఎలా నివారించాలో వివరించారు. ప్రజలను చైతన్యపరిచారు. నిల్వనీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె. శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ సత్యనారాయణ , ఆరోగ్య కార్యకర్తలుధనలక్ష్మి, అమరావతి, రమాదేవి, ఆశాలు రత్నకుమారి, ప్రశాంతి, రమణ,మరియమ్మ లు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



గ్రామాల్లో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని పలువురు వక్తలు తెలిపారు. బుధవారం సోమవరప్పాడు, వీరభద్రపురం కమ్యూనిటీ హాలులో గర్భిణులకు యువతి ,యువకులకు ఉచితంగా హెచ్ఐవీ సిఫిలిస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా డీపీఆర్ ఎ. రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు గ్రామాల్లో మొబైల్ ఐసీటీసీ ద్వారా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, సీఎల్‌డబ్ల్యూ బీ జ్యోతి, మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ డాక్టర్ సురేష్ , ల్యాబ్ టెక్నీషియన్ హనుమంత్ పాల్గొన్నారు.

ఈస్టర్ పాట విడుదల



పాటను విడుదల చేస్తున్న ఏలూరు బిషప్ పొలిమేర జయరావు

దెందులూరు: మండలంలో ఆర్‌సీఎం దెందులూరు ప్యారిస్ ప్రీస్ట్ ఫాదర్ జి అమ్మన్ రాజా రచించి స్వరకల్పన సమర్పణ చేసిన ఆదివారం ప్రాతఃకాలం నూతన పాటను ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. నూతన పాటను రచించిన ఫాదర్ అమ్మన్ రాజాను బిషప్ జయరావు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రమాదాలపై అవగాహన అవసరం



భీమడోలులో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న జి.నాగరాజు

భీమడోలు: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని భీమడోలు అగ్నిమాపకాధికారి జి.నాగరాజు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన బుధవారం అపార్ట్‌మెంట్ల వద్ద అపార్ట్‌మెంట్ వాసులు, మహిళలకు అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. వంట చేసే తరుణంలో మంటలు చేలరేగితే ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, రెగ్యులేటర్‌ను ఆర్పాలని, వాటిని ఆర్పే విన్యాసాన్ని చూపించారు. విపత్తులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక కేంద్రం సిద్ధంగా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు పెంచాలి



ఉంగుటూరులో ఉపాధి ఫీల్డ్ సహాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఉంగుటూరు: పనిప్రదేశాలలో వసతులు పెంచాలని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజు తెలిపారు. బుదవారం ఉంగుటూరు ఎంపీడీవో ఫీల్డ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిదినాలు కచ్చితంగా పెంచాలని కోరారు. కూలీలకు వడ దెబ్బ తగలకుండా ఉదయం ఆరు గంటలకు పనిలోకి వచ్చేలా 11 గంటలులోపే వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీవోలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేంద్రం నుంచి తెస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని సోమవరప్పాడులో రూ. 74 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు, సిమెంట్ రోడ్డును దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. గోపాలపురం నుంచి రామసింగవరం వరకు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ శంకుస్థాపన చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), మాజీ ఏఎంసీ చైర్మన్ మాగంటి సురేంద్రనాథ్ చౌదరి, నాయకులు మాగంటి వంశీ, గిరి, అల్లు జ్యోతి,నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య



పోలసానిపల్లిలో చిన్నారులకు చేర్పించుకుంటున్న ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని భీమడోలు ఎంఈవో 1, 2లు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్‌లు అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం బడిఈడు పిల్లలను చేర్పించే ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలసానిపల్లిలో హెచ్ఎంలు కె.తులసి, శ్యామలలు కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చిన్నారులకు చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. నైపుణ్యం గల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాల్లో ఉన్నారని, ఉత్తమ విద్యాబోధన వారి వల్ల చిన్నారులకు అందుతుందన్నారు. ప్రైవేటు మోజులో పడి పిల్లల భవిష్యత్తును దెబ్బతీయవద్దని కోరారు. పోలసానిపల్లి నెం.1, నెం.2 పాఠశాలల పరిధిలోని ఐదేళ్ల నిండిన 10 మంది చిన్నారులకు అడ్మిషన్లు అందజేశారు. గుండుగొలను నెం.1 పాఠశాలలో హెచ్ఎం పాశం పాండురంగారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో 2 అయినపర్తి భాస్కరరావు పాల్గొని అంగన్‌వాడీ పాఠశాలలను సందర్శించారు. అక్కడ ఐదేళ్లు నిండిన చిన్నారులకు అడ్మిషన్లు అందించారు. ప్రభుత్వ బడిలోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఎంసీ చైర్మన్ కె.రమేష్, టీచర్లు కె.నాగలక్ష్మి, కె.ఫణిదత్‌కుమార్, డి. ఆనందబాబు, టి.సంధ్య, సీఆర్‌పీ ఎస్‌వీఎస్ సత్యప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను కించపరిస్తే సహించం



మోరు రామరాజు

దెందులూరు: రాష్ట్రంలో ఏ పార్టీ ప్రజాప్రతినిధులైన నాయకులైన బీసీలను కించపరిస్తే సహించబోమని వాటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటదని రాష్ట బీసీ సంఘం ముఖ్య నాయకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మోరు రామరాజు హెచ్చరించారు. బుధవారం ఏలూరు రోడ్డు మండలం మాదేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట బీసీ ముఖ్య నేత అయిన మాజీ మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావును కించపరిచే విధంగా కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలను బీసీలందరినీ కించపరిచే విధంగా ఉందన్నారు. కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడిన మాటల్లో తప్పేముందని ప్రశ్నించారు. బీజేపీలో పోటీ చేయని, గెలవని ఎంపీటీసీ సభ్యులను పోలీసుల బలంతో అండతో దౌర్జన్యంగా ప్రజాస్వామ్యాన్ని కించపరిచే విధంగా పట్టపగలు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను కూటమి పార్టీ తరపున మద్దతు ఇచ్చే విధంగా ఎలా ప్రకటించుకుంటారని ప్రశ్నించారు. ఈ సంఘటన దారితప్పినరాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. కేంద్ర మంత్రి ప్రజలకు మేలు చేసే విధంగా వ్యాఖ్యానించాలి వ్యవహరించాలి తప్ప ఓ సామాజిక వర్గానికి చెందిన నేతలను టార్గెట్ చేసి వ్యాఖ్యానించడం సరికాదని మోరూ రామరాజు అన్నారు.

జాలిపూడిలో జాతర ప్రారంభం



కోలాట నృత్యం చేస్తున్న చిన్నారులు, మహిళలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో బుధవారం జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. దాదాపు 32 ఏళ్ల తర్వాత శ్రీ గంగానమ్మ, శ్రీ ఆదిమహాలక్ష్మమ్మ, శ్రీ వినుకొండ అంకమ్మ, శ్రీ పోతురాజు బాబు జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అమ్మవార్లను దర్శించుకుని, పూజలు చేశారు.

సగరులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో 50 వేల మంది ఉన్న సగరులకు రాజకీయ ప్రాథమిక కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి కోరారు. ఏలూరు జిల్లా సగర సంఘం అధ్యక్షుడిగా కుప్పల ఆంజనేయులు ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా లక్కోజు రాజగోపాలాచారి బుధవారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరారు. త్వరలో అన్ని రాజకీయ పార్టీ నాయకులు కలుస్తామని బీసీలు ఒక తాటి మీద తీసుకు వచ్చి బీసీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో ఉక్కుసూరి గోపాలకృష్ణ, పామర్తి యేసు రాజు, బాయి వెంకటరావు, జరజాపు రాఘవ పాల్గొన్నారు.

భీమడోలు ఏఎంసీ చైర్మన్‌గా శేషపు గిరి

భీమడోలు: భీమడోలు ఏఎంసీ చైర్మన్‌గా శేషపు గిరి ఏకగ్రీవం ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో విడత నామినేటెడ్ జాబితాను బుధవారం రాత్రి ప్రకటించారు. భీమడోలు టీడీపీ ఎంపీటీసీగా గతంలో పనిచేశారు. తనకు ఈ పదవిని అప్పగించిన ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుకు రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేయాలని వినతి

పెదపాడు: మండలంలోని తోటగూడెం గ్రామ హిందూ శ్మశాన వాటిక ఆక్రమణల కారణంగా వాహనాలకు అంతరాయం కలుగుతోందని సదరు స్థలాన్ని సర్వే నిర్వహించాలని గ్రామస్తులు అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గ్రామసభలో కోరారు. దీంతో వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామస్థుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని గ్రామస్థులు ప్రస్తావించిన అంశాలతో సంబంధిత స్థలాన్ని సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించాలంటూ పెదపాడు తహసీల్దార్‌కు గ్రామసభలోని విషయాన్ని సూచిస్తూ పంచాయతీ కార్యదర్శి వినతి పత్రాన్ని అందజేశారు.

స్వచ్ఛభారత్ ప్రత్యేక బృందం రాక



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజు

ఉంగుటూరు: స్వచ్ఛ భారత్‌పై ప్రత్యేక బృందం గురువారం ఉంగుటూరులో పర్యటిస్తున్నట్లు ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు. చెత్త నుంచి సంపద మరింతగా ఎలా సాధించ వచ్చునో అనే విషయాలపైన పరిశీలన చేయనున్నారు. అలాగే ఉంగుటూరులో అమలు అవుతున్నా విధానాలు ఎలా ఉన్నాయనేది పరిశీలన చేస్తారు. ఈమేరకు ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజు బుదవారం సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీర్డీ చంద్రశేఖర్, ఈవో రవికుమార్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.15 వేలు పింఛన్ అందజేయాలి

దెందులూరు: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.15 వేలు పింఛన్ అందజేయాలని, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ మంజూరు చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బయ్యారపు రాజేశ్వరరావు, తనగాల శేఖర్, కందుల రమేష్, కొత్తపల్లి మురళి, కాశీ కృష్ణ మాదిగ, ముళ్ళపూడి సుమన్, మేరీ, ప్రసాద్, మామిడిపల్లి నాగభూషణంలు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంఆర్‌పీఎస్ ఎంఈఎఫ్ఎంఎస్ఎఫ్ నాయకులు ఏలూరులో రాష్ట్ర మంత్రిని కలిశారు. ఎస్సీ వర్గీకరణకు కూటమిప్రభుత్వం కట్టుబడి ఉన్నందుకు త్వరితన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ప్రారంభం



విజయవాడ నాన్‌స్టాప్ బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు డిపో నుంచి బుధవారం ఏలూరు నుండి విజయవాడ నాన్ స్టాప్ సర్వీస్ కొత్త అల్ట్రా డీలక్స్ సర్వీసును ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, విజయవాడ జోనల్ 2 చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రజలకు సరికొత్త బస్సులు మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలను పెంచాలి



గణపవరం పీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్షిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో నాయక్

గణపవరం: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను బాగా పెంచాలని, ఈమేరకు సిబ్బంది క్షేత్రస్థాయిలో బాగా పనిచేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి భానునాయక్ అన్నారు. బుధవారం ఆయన గణపవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో సదుపాయాలు, సిబ్బంది పనితీరు సమీక్షించారు. క్షయ వ్యాధి పరీక్షలు, రక్త పరీక్షలు చేసిన రికార్డులను ఆయన పరిశీలించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వేపై ఆరా తీశారు. ఇప్పటివరకూ 94 శాతం సర్వే పూర్తయిందని, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం నూరుశాతం పూర్తి చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి వివరించారు. పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను, పథకాల అమలును ఆయన తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, కంటివైద్య అధికారి శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల మార్పుపై అప్రమత్తంగా ఉండాలి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

ఉంగుటూరు: మండలంలో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్ పాతూరి విజయ్‌కుమార్ కోరారు. బుధవారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల సక్రమంగా ఉండేలా ప్రతిపాదనలు చేశామని, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీటీ పోతురాజు, బీజేపీ నాయకురాలు అడపాశోభారాణి, సీపీఎం నాయకుడు గుత్తికొండ వెంకట కృష్ణారావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శారద

పెదపాడు: పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని స్త్రీ శిశుసంక్షేమశాఖ పీడీ పి.శారద తెలిపారు. పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని వేంపాడు గ్రామంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ పి శారద మాట్లాడుతూ సరైన పోషకాహారం తీసుకోకపోతే రక్తహీనతకు గురవుతారని తెలిపారు. బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గారపాటి రామసీత అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో కార్యక్రమంలో పెదపాడు ప్రాజక్టు అదనపు సీడీపీవో ఎం ఎస్ రాజశేఖర్, పీడీ కార్యాలయ ఈఓ వి మల్లిక, పర్యవేక్షకురాలు కుమారి స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.